RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

*The Pride of Telugu national daily*



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శుక్రవారం 09-10- 2026 సంపుటి : 6 సంచిక : 238 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

## కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం




- సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన
- భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అరెస్ట్

## గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

- అమెరికాలో పెర్మ్ సస్పెన్షన్..
- ఐటీ దిగ్గజాలకు భారీ షాక్
- భారత టెక్కీల గ్రీన్ కార్డ్ ఆశలు గల్లంతు!




## పేదల ఓట్లు తొలగించే కుట్ర

### ఓటు హక్కు హరణకు బీజేపీ పార్టీ పన్నాగం

- సైమన్ కమిషన్?లా ఉపయోగించే ప్లాన్
- మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి
- గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాటం తప్పదు
- ఢిల్లీ ఇండియా కూటమి నిరసనలో రేవంత్



న్యూఢిల్లీ, **అభ్యుదయం** ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు

మిగతా 2లో

## బీజేపీవ్యతిరేక ఓట్లు తొలగించే కుట్ర

- సర్ ప్రక్రియతో ఆ కుట్రకు తెరతీసారు
- అభిజీత్ దీప్కే, ధ్రువ్ రాఠీ, ప్రకాశ్ రాజ్
- సీఈసీ రాజీనామాకు పలువురు డిమాండ్
- పీపుల్స్ ట్రెబ్యునల్ పేరుతో భారీ నిరసన
- కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన



న్యూఢిల్లీ, **అభ్యుదయం**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కొద్ది రోజులుగా ఈ సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష పార్టీలు సహా కాక్రోచ్ జనతా పార్టీ, ఇతర పౌర సమాజ సంఘాలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకివ్యతిరేకంగా ఓటు వేసే వర్గాల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికే ఈ సర్ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ, ఇతర పౌర సమాజ ప్రతినిధులతో కలిసి బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో 'పీపుల్స్ ట్రెబ్యునల్' పేరిట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభిజీత్ దీప్కే సహా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు, కార్యకర్త అయిన ప్రకాశ్ రాజ్– ఎన్నికల సంఘం తీరుపై విరుచుకుపడ్డారు. సర్ ప్రక్రియను తీవ్రంగా విమర్శించిన సీజేపీ వ్యవస్థాపకుడు

- మిగతా 2లో పేజిలో

## దసరాకు ఏపీఎస్ఆర్టీసీ 5,261 ప్రత్యేక బస్సులు




- రాష్ట్రవ్యాప్తంగా 5,261 సర్వీసుల ఏర్పాటు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయం
- అక్టోబర్ 16 నుంచి 25వ తేదీ వరకు అందుబాటులో

## జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

- 14 మంది అన్నదాతలపై ఎఫ్?ఐఆర్ నమోదు
- ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన పాలన
- సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి
- అందుకే రైతులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన
- రైతులపై కేసులు పెట్టడం హేయమైన చర్య
- రైతులపై కేసుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్



హైదరాబాద్, **అభ్యుదయం** జూరాల ఎడమగట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదుతో 14 మంది రైతులపై ఎఫ్?ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువలకు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ

మిగతా 2లో

## మారుమూల పల్లెలకూ బ్యాంకులు ఆసుపత్రులు



- టెలికాం రంగంలో సరికొత్త విప్లవం తెచ్చాం
- 'డిజిటల్ ఇండియా'తో టెక్నాలజీ అందుబాటులోకి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన మోదీ

2లో

# గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!




న్యూఢిల్లీ, అక్టోబర్ 08: అమెరికాలో ఐటీ రంగంలో పనిచేస్తూ శాశ్వత నివాస హోదా పొందాలని ఆశపడుతున్న వేలాది మంది భారతీయ నిపుణులకు అమెరికా ప్రభుత్వం తీరని గుండెకోత మిగిల్చింది. అమెరికన్ల ఉద్యోగ అవకాశాలు, వేతన భద్రతను పరిరక్షించడమే ధ్యేయంగా వైట్‌హౌస్ వేదికగా జరిగిన అత్యున్నత సమావేశంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ సంచలన నిర్ణయం ప్రకటించింది. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణలో ఐటీ ఔట్‌సోర్సింగ్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, వి?ో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి సంస్థలపై పెర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేసింది. ఇకపై ఈ సంస్థల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులు స్వీకరించబోమని, ప్రస్తుతం ప్రాసెసింగ్‌లో ఉన్న ఫైళ్లను కూడా తక్షణమే నిలిపివేస్తున్నామని తేల్చిచెప్పింది. అసలు అమెరికాలో విదేశీ ఉద్యోగికి ఇబీ-2, ఇబీ-3 కేటగిరీల కింద గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్ ప్రారంభించాలంటే ఈ పెర్మ్ ప్రక్రియే అత్యంత కీలకమైన, చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగానికి అవసరమైన అర్హతలున్న అమెరికన్ పౌరులు ఎవరూ స్థానికంగా అందుబాటులో లేరని, విదేశీయుడిని నియమించడం వల్ల స్థానిక వర్కర్ల వేతనాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించి సర్టిఫికేషన్ పొందాల్సి ఉంటుంది. ఈ అనుమతి వచ్చిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేసే అర్హత సాధిస్తాయి. ఇప్పుడు ఈ ప్రధాన రహదారినే అమెరికా మూసివేయడంతో సదరు దిగ్గజ సంస్థలు తమ ఉద్యోగుల తరఫున గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను కోల్పోయాయి. గత కొన్నేళ్లుగా అమెరికా హెచ్-1బీ మరియు పెర్మ్ నిబంధనలను ఈ ఔట్‌సోర్సింగ్ కంపెనీలు పక్కదారి పట్టిస్తున్నాయని, లొసుగులను ఆసరాగా చేసుకుని విదేశీ నిపుణుల రిక్రూట్‌మెంట్‌లో తీవ్ర దుర్వినియోగానికి పాల్పడ్డాయని ఫెడరల్ దర్యాప్తు బృందాలు నిర్ధారించాయి. దాదాపు 30 లక్షల మంది విదేశీయుల కోసం దరఖాస్తులు చేసి, 2.3 లక్షలకు పైగా హెచ్-1బీ అనుమతులు, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు పొందడం ద్వారా అమెరికన్ పౌరులకు చెందాల్సిన స్థానిక ఉద్యోగ అవకాశాలను దెబ్బతీశారని కార్మిక శాఖ మండిపడింది. తీవ్ర ఫెడరల్ విచారణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, స్థానిక కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ కఠిన ఆంక్షలను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది.

## దసరాకు ఏపీఎస్‌ఆర్టీసీ 5,261 ప్రత్యేక బస్సులు

అమరావతి, అక్టోబర్ 08: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేస్తోంది. పండుగ సీజన్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి మొత్తం 5,261 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులకు ఊరటనిస్తూ, ఈ ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలనే వసూలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సర్వీసులు అక్టోబర్ 16 నుంచి 25వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. పండుగకు ముందు, అనగా అక్టోబర్ 16 నుంచి 19 వరకు 3,207 బస్సులను, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 20 నుంచి 25 వరకు 2,054 సర్వీసులను నడపనున్నారు. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పెద్ద సంఖ్యలో బస్సులను కేటాయించారు. అత్యధికంగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు 1,186 బస్సులు నడుపుతుండగా, విజయవాడకు 1,053, బెంగళూరుకు 475, విశాఖపట్నానికి 440 బస్సులు కేటాయించారు. అలాగే రాజమండ్రికి 347, తిరుపతికి 247, చెన్నైకి 153 సర్వీసులు నడపనున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే, ఎన్టీఆర్ జిల్లా నుంచి అత్యధికంగా 804 ప్రత్యేక సర్వీసులు నడపనుండటం గమనార్హం. ఈ ఏడాది దసరా ఉత్సవాలు అక్టోబర్ 11న ప్రారంభం కానుండగా, 20న విజయదశమి పర్వదినం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని, ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## తీవ్ర మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మెదక్, అక్టోబర్ 08మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్య కాపురానికి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చింతల వెంకటేష్ కు ఆరు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా చిల్లసారం (క్షీరసాగర్) గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. కుటుంబ కలహాల కారణంగా సుమారు రెండేళ్ల క్రితం మౌనిక తన పుట్టింటికి వెళ్లినట్లు సమాచారం. అప్పటి నుంచి ఆమె తిరిగి భర్త వద్దకు రాకపోవడంతో వెంకటేష్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 30న ఇంటి సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి బయటకు వెళ్లి చూడగా..చెట్టుకు వేలాడుతూ కనిపించాడు.కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆర్‌పీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటేష్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కుటుంబ సమస్యలు, ఒత్తిడి లేదా వ్యక్తిగత కష్టాల కారణంగా ఎవరైనా తీవ్రంగా బాధపడుతున్నట్లయితే వారిని ఒంటరిగా వదిలేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు వెంటనే అండగా నిలవడం చాలా ముఖ్యం. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అత్యవసర సేవలను సంప్రదించాలని పోలీసులు, మానసిక ఆరోగ్య నిపుణులు సూచిస్న?న్నారు.

# బీజేపీవ్యతిరేక ఓట్లు తొలగించే కుట్ర



అభిజీత్ దీప్కే, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు తాము బతికే ఉన్నాయని చూయించేందుకు ఈ కార్యక్రమానికి వచ్చారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే వారిలో కొందరిని వేదికపైకి తీసుకొచ్చి 'వారు భౌతికంగా చనిపోలేదు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోంది.' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు, ఇంకా ఒక్క కర్ణాటకలోనే దాదాపు కోటి ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఓట్లను తొలగించి, దొంగిలించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యారని విమర్శించారు. ప్రధాని, ఎన్నికల సంఘం కలిసి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాలతోనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘం అధికారులు ఓట్లు తొలగిస్తున్నారని విమర్శలు చేశారు. ఇదే సమయంలో రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కూడా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకోవాలని దీప్కే పిలుపునిచ్చారు. ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ మాట్లాడుతూ- తాను ఏ రాజకీయ పార్టీ తరఫున ఈ కార్యక్రమానికి రాలేదని, కేవలం సాధారణ పౌరుడిగా పాల్గొన్నట్లు తెలిపారు. అలానే ఓట్ల చోరీ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన సమస్య కాదని, ప్రతి పౌరుడికీ సంబంధించిన అంశమని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పూర్తిగా లోపించాయని, ఓటరు జాబితా నుంచి పేర్లను ఇష్టారాజ్యంగా తొలగించడం, కొత్తగా చేర్చడం చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు ఆదేశించే వరకు బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాల్ని ఎన్నికల సంఘం ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. బంగాల్‌లోనూ ఎన్నికలకు ముందు సుమారు 70 వేల మంది ఓటర్ల పేర్లను తొలగించి, ఫలితాల తర్వాత మళ్లీ చేర్చారని ధ్రువ్ రాఠీ ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నటుడు, కార్యకర్త ప్రకాశ్ రాజ్ కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రక్రియతో ఓట్ల తొలగింపు కేవలం ఓటు హక్కుపై దాడి మాత్రమే కాదని, ఇది దేశ ప్రజల ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. 'మా పోరాటం కేవలం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతోనే ఆగిపోదు. ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తి వచ్చినా ఎలాంటి మార్పు ఉండదు. ఈ సర్ ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలి.' అని ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. గిరిజనులు, ముస్లింలు, పేదలు, ఇతర మైనారిటీ వర్గాల ఓటర్లనే లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 08(ఆర్ఎన్ఏ): దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ భారత టెలికాం, డిజిటల్ రంగాల ప్రగతిని సమగ్రంగా వివరించారు. కరోనా సంక్షోభ సమయంలోనూ వెనకడుగు వేయకుండా టెలికాం సేవలను గ్రామీణ ప్రాంతాల వరకు బలంగా తీసుకెళ్లామని చెప్పారు. డిజిటల్ కనెక్టివిటీ ఆధారంగానే పల్లెల్లో ఉండే ప్రజల ముంగిటకు బ్యాంకింగ్, వైద్యం సహా కీలకమైన ప్రభుత్వ సేవలను చేర్చడం సాధ్యమైందని స్పష్టం చేశారు. విప్లవాత్మక టెలికాం సంస్కరణల ద్వారా దేశంలో పారదర్శక పాలనను మరింత బలోపేతం చేశామని, పేదలకు అందాల్సిన సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టకుండా కాపాడగలిగామని తెలిపారు. వ్యవస్థల్లో తీసుకొచ్చిన ఈ మార్పులను ఎవరు వ్యతిరేకించినా సంస్కరణల ప్రయాణం ఆగబోదని స్పష్టం చేశారు.దేశంలో టెలికాం మౌలిక వసతులు ఊహించని రీతిలో విస్తరించాయని మోదీ వెల్లడించారు. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ నెట్‌వర్క్ చేరుకుందని, ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు. 2022 నాటి పరిస్థితులతో పోలిస్తే దేశంలో మొబైల్ ఇంటర్నెట్ వేగం ఏకంగా పది రెట్లు పెరగడం గర్వకారణమని చెప్పారు.

# పేదల ఓట్లు తొలగించే కుట్ర

కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు.



బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత





రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

## జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్? ధ్వంసంచేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రాజెక్ట్? నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫాస్టెనింగ్?లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్?లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్క్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి. మరోవైపు తెలంగాణలో జూరాల సాగునీటి అంశం మరోసారి తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీటిని విడుదల చేసుకున్న 14 మంది రైతులపై కేసులు నమోదైనట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైతులపై కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. పంటలు ఎండిపోతుంటే సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం సరికాదని విమర్శించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు, వివిధ పార్టీల నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులను నీటిని విడుదల చేయాలని కోరినా స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ 19వ తేదీన సాయంత్రం కొందరు రైతులు స్వయంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారు. జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపైనా కేసులు నమోదు చేశారు.

## కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

హైదారాబాద్, అక్టోబర్ హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జెస్ జనవరి నుంచి?

**త్వరలో అధికారికంగా స్పష్టతవచ్చే అవకాశం**




యూపీఐ ద్వారా జరిగే రూ.2000పైన లావాదేవీలపై ప్రతిపాదించిన ఛార్జీల అమలును కొన్ని నెలలపాటు వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం (Union Govt) యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు పండగల సీజన్ (Festive season) ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టతవచ్చే అవకాశం ఉన్నది.
రూ.2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలను అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. అయితే ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ నిర్ణయంవల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరుకుంది.అదేవిధంగా పండగల సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుంది. కాగా ఆరేళ్లకుపైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగ ుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగదారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారులవైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకుపైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు.
ఆగస్టు 2026 లోనే యూపీఐ ద్వారా రూ.29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే అది దసరా, దీపావళి వంటి పండగల వేళ వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలుగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం.
అదే సమయంలో ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభించనుంది.

## ఈసీపై ఇండియా కూటమి పోరు..

**'ముందు లంచ్.. తర్వాత నిరసన' ఫార్ములా!**




ఢిల్లీ, ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌పై ఇండియా కూటమి పోరు కొనసాగుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్ష ఎంపీలు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో కొత్త ఫార్ములాను ఫాలో అవుతున్నారు కూటమి నేతలు! 'ముందు లంచ్.. తర్వాత నిరసన!' అన్నట్టు సాగుతోంది వారి తీరు. బుధవారం సాగర్ రత్నలో భోంచేసి ఆందోళనకు బయలుదేరిన విపక్ష నేతల కోసం.. గురువారం మోయెట్స్ రెస్టారెంట్‌లో భోజనం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి రాజ్‌ఘాట్‌కు వెళ్లి నిరసన కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఎంపీలను తీసుకెళ్లేందుకు హోటల్ బయట బస్సులు కూడా సిద్ధం చేశారు. మొత్తంగా ఈసీపై పోరాటం నేపథ్యంలో రెస్టారెంట్లు, నిరసన ప్రదేశాలు మారినా.. లంచ్ తర్వాతే ఆందోళన అనే ఫార్ములా మాత్రం యథాతథంగా కొనసాగుతోంది.డిజిటల్ యుగంలో కళ్లకు ముప్పు.. జాగ్రత్తలు తప్పనిసరికాగా.. బుధవారంనాడు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లి నిరసన చేపట్టేందుకు యత్నించిన విపక్ష నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ హైడ్రామాలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో షాంగ్రిలా హోటల్ వద్ద.. ప్రియాంక గాంధీ రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని రోడ్డుపై పడుకుని నిరసన తెలపగా.. రాహుల్ పోలీసుల వాహనంలోకి వెళ్లేందుకు నిరాకరించారు. ఈ క్రమంలో ప్రియాంకతో పాటు రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు పోలీసులు.

## రాష్ట్రంలో మండుతున్న ఎండలు..

**పలు ప్రాంతాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..!**




రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతున్నది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండల మంటలు, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా.. భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావంవల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని వాతావరణ అధికారులు చెప్పారు. రుతుపవనాల తిరోగమనం ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## సెన్సెక్స్ 1,100 పాయింట్లు పతనం..

**రూ.8 లక్షల కోట్లు ఆవిరి..**




దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం భారీగా పతనమైంది. అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సెన్సెక్స్ 1100 పాయింట్లకు పైగా కుప్పకూలింది. దీంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా ఆవిరైంది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.8 లక్షల కోట్ల మేర తగ్గింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి మార్కెట్ పతనానికి ప్రధాన కారణాల్లో ముడి చమురు ధరల పెరుగుదల కూడా ఒకటి. మధ్యప్రాచ్యంలో సరఫరాకు సంబంధించిన ఆందోళనలు కొనసాగడంతో బ్రెంట్ క్రూడాయిల్ ధర 3.9 శాతం పెరిగి బ్యారెల్‌కు 104.09 డాలర్లకు చేరింది. మరోవైపు ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చడం కూడా ప్రతికూలంగా మారిందివిదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా భారత ఈక్విటీల్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. అక్టోబర్ 7న ఎఫ్ఐఐలు సుమారు రూ.6,121 కోట్ల విలువైన భారత ఈక్విటీలను విక్రయించారు ఎఫ్ఐఐల నిరంతర అమ్మకాలు కొనసాగితే మార్కెట్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్ 5.3 శాతం ప్రాంతానికి చేరడం కూడా ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడి పెంచింది. డాలర్ బలపడటంతో రూపాయి కూడా ఒత్తిడిని ఎదుర్కొంటోంది.మార్కెట్ పతనం కారణంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ, లోహాలు, ఆటో తదితర రంగాల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. దాదాపు అన్ని రంగాలూ నష్టాల్లోనే కదలాడుతున్నాయి. అధిక విలువల వద్ద ఉన్న కొన్ని షేర్లలో కూడా భారీగా లాభాల స్వీకరణ జరిగింది.

## రంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం .. యువకుడి మృతి

రంగారెడ్డి, అక్టోబర్ 8: మొయినాబాద్ మండలంలో రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మొయినాబాద్‌కు చెందిన దుబ్బా సుభాష్(35) అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయనతో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జయంత్ బల్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జయంత్ బల్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.
పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. బైక్‌ను కారు బలంగా ఢీకొనడంతో సుభాష్‌కు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై మృతుడి సోదరుడు వరప్రసాద్ మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పుత్తారి నవీన్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, కారు వేగం తదితర అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## తెలంగాణను బీజేపీ టార్గెట్ చేసింది..

**92 లక్షల ఓట్లు తొలగించారంటూ మహేశ్ ఆరోపణలు**



హైదరాబాద్, అక్టోబర్ 8: మోదీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందో దేశ ప్రజలు గమనిస్తున్నారని.. ఇప్పటికైనా దేశ ప్రజలు మేల్కొవాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేష్ ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో యథేచ్ఛగా ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నామన్నారు.
బిహార్, వెస్ట్ బెంగాల్ తర్వాత తెలంగాణను బీజేపీ ప్రభుత్వం టార్గెట్ చేసిందని మహేశ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించిందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షా వల్ల 12 సంవత్సరాల్లో దేశ ప్రజలకు ఎంత మేలు కలిగిందో ఆలోచించాలన్నారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు

## బేగంపేట్‌లో నకిలీ ఎయిర్‌ఫోర్స్ అధికారి..

**యువతులకు వల వేస్తూ బుక్కయ్యాడు..!**




హైదరాబాద్: బేగంపేట్‌లో నకిలీ ఎయిర్‌ఫోర్స్ అధికారి కలకలం సృష్టించాడు. ఫ్లయింగ్ ఆఫీసర్ డ్రెస్‌లో బేగంపేట్ పరేడ్ గ్రౌండ్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. అక్కడ ఫొటోలు దిగుతూ సంచరించాడు. అనుమానాస్పదంగా వ్యవహరించడంతో మిలిటరీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల అనంతరం అతడిని నకిలీ ఎయిర్‌ఫోర్స్ అధికారిగా తేల్చారు. నిందితుడిని బిహార్‌కు చెందిన నితీశ్ కుమార్ పాల్‌గా గుర్తించారు. అతను ప్రస్తుతం నేరెడ్‌మెట్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.అయితే, తాను ఎయిర్‌ఫోర్స్ అధికారినంటూ నితీశ్ కుమార్ యువతులకు వల వేస్తున్నట్లు విచారణలో అధికారులు గుర్తించారు. నిందితుడి ఫోన్‌ను తీసుకుని పరిశీలించగా.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎయిర్‌ఫోర్స్ అధికారి పేరుతో యువతులకు పరిచయం అవుతున్నట్లు నిర్ధారించారు. వారిని వలలో వేసుకునేందుకే తాజాగా ఫొటోలు దిగేందుకు పరేడ్ గ్రౌండ్‌కు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. విచారణ అనంతరం నిందితుడిని మిలిటరీ అధికారులు బేగంపేట్ పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతడు ఎప్పటి నుంచి నకిలీ అధికారి అవతారంలో కొనసాగుతున్నాడు? ఎవరెవరిని మోసం చేశాడు? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

## రష్యాలో ప్లేగుతో మరో మరణం.

**. అది తప్పుడు ప్రచారమంటున్న క్రెమ్లిన్..!**



రష్యా లో ప్లేగువ్యాధి వ్యాప్తిపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ వ్యాధితో తాజాగా మరో మరణం సంభవించిందంటూ ఆ దేశ మీడియాలో తాజాగా కథనాలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన క్రెమ్లిన్ ఆ వార్తలను కొట్టిపారేసింది. అదంతా తప్పుడు ప్రచారమేనని స్పష్టంచేసింది. అంటువ్యాధి ప్రబలే ప్రమాదం లేదని తేల్చి చెప్పింది. సైబీరియాలోని యాంటీ ప్లేగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసే షిపిలోవా అనే మహిళ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె మరణానికి ల్యాబ్ నుంచి లీకైన ప్లేగు బ్యాక్టీరియానే కారణమని వార్తలు వచ్చాయి. దాంతో ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇదే సమయంలో రష్యాలో మరో వ్యక్తి కూడా ఈ వ్యాధి కారణంగా మరణించారంటూ కథనాలు రావడం ఆందోళనకు గురిచేసింది.ఈ నేపథ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ వార్తలపై స్పందించారు.
అదంతా అసత్య ప్రచారమేనని కొట్టిపారేశారు. ఆరోగ్య విభాగం నుంచి అధికారికంగా వచ్చిన సమాచారాన్నే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు.



## 18 స్థానాలు ఎగబాకిన శ్రేయస్ అయ్యర్

**కెరీర్ బెస్ట్ 7వ ర్యాంక్ సాధించిన అయ్యర్**

ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు. నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరపున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు.

# అగార్కర్ వల్లే భువీ కంబ్యాక్ ఆగిపోయిందా?



టీమిండియా స్వింగ్ సుల్తాన్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో భువికి చోటు దక్కడం అభిమానులకు ఊరటనిచ్చింది. అయితే ఇన్నాళ్లూ ఆయనను జట్టులోకి తీసుకోకపోవడానికి మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కరే ప్రధాన కారణమంటూ ఒక దిగ్భ్రాంతికర కథనం వెలుగులోకి వచ్చింది. అగార్కర్ పదవీ కాలం ముగియడం, ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వంలోని తాత్కాలిక సెలెక్షన్ కమిటీ రావడం వెనువెంటనే జరగడంతో భువి కమ్‌బ్యాక్ సాధ్యమైంది.గత కొంతకాలంగా ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ భువనేశ్వర్ కుమార్‌ను అగార్కర్ సెలెక్షన్ కమిటీ వరుసగా పక్కన పెడుతూ వచ్చింది. భవిష్యత్తు అవసరాల కోసం కేవలం యంగ్ ఫాస్ట్ బౌలర్లను మాత్రమే ప్రోత్సహించాలని అగార్కర్ గట్టిగా భావించడమే దీనికి కారణమని తెలుస్తోంది. కమిటీలోని మాజీ పేసర్ ఆర్పీ సింగ్ పలుమార్లు భువీ పేరును ప్రతిపాదించినా, అగార్కర్ మద్దతు లభించకపోవడంతో ఆయన రీఎంట్రీ ఆలస్యమైందని ఆ నివేదిక పేర్కొంది. అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా తప్పుకున్న తర్వాత బీసీసీఐ ప్రజ్ఞాన్ ఓజాను తాత్కాలిక సెలెక్షన్ కమిటీ హెడ్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఓజా, భువనేశ్వర్ అనుభవంపై పూర్తి నమ్మకం ఉంచి న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేశారు. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేని లోటును భర్తీ చేసేందుకు, అనుభవజ్ఞుడైన భువీ ఉండటం జట్టుకు ఎంతో ప్రయోజనకరమని సెలెక్టర్లు భావించారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో ఆర్‌సిబి వరుసగా రెండు టైటిళ్లు గెలవడంలో కీలక పాత్ర పోషించారు. భువి రీఎంట్రీ కేవలం పాత పేరు చూసి ఇచ్చినది కాదు. ఐపీఎల్ 2025లో ఆర్‌సిబి తరఫున 14 మ్యాచుల్లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 16 మ్యాచుల్లో ఏకంగా 28 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో సత్తా చాటారు. భారత్ తరఫున ఇప్పటివరకు 87 ƒ20 మ్యాచ్‌ల్లో 90 వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్, కొత్త బంతితో స్వింగ్ చేసే నైపుణ్యంతో మళ్లీ టీమిండియాలో మెరవడానికి



సిద్ధమయ్యారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో యంగ్ టీమ్‌తో కలిసి ఆయన న్యూజిలాండ్ సిరీస్‌లో ఆడనున్నారు. న్యూజిలాండ్ సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, శివం దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ స్థానం సంపాదించారు. ఈ యంగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ కాంబినేషన్ సిరీస ్‌లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

.........

# భారత మహిళా క్రికెట్? జట్టు కెప్టెన్?గా స్మృతి మంధాన

భారత మహిళ క్రికెట్? జట్టు కెప్టెన్?గా సీనియర్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితులయ్యారు. భారత మహిళా క్రికెట్ జట్టు సారథ్యం నుంచి హర్మన్ ప్రీత్ కౌర్ వైదొలిగిన నేపథ్యంలో ఆమె స్థానంలో స్మృతి మంధానను కెప్టెన్‌గా నియమిస్తూ బీసీసీఐ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా స్మృతి మంధానకు బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా శుభాకాంక్షలు తెలిపారు. భారత మహిళ క్రికెట్ జట్టులో అత్యంత అనుభవజ్ఞులైన క్రీడాకారిణుల్లో ఒకరైన మంధాన, 2013 నుంచి జాతీయ జట్టులో సభ్యురాలిగా కొనసాగుతూ ఈ బాధ్యతను చేపట్టారు. ఆమె గతంలో 18టీ20, లు, నాలుగు వన్డేలలో భారత జట్టుకు నాయకత్వం వహించారు. భారత జట్టుకు నాయకత్వం వహించే బాధ్యత తనకు అప్పగించడంపై స్మృతి మంధాన స్పందించారు. ఇది తనకు దక్కిన ప్రత్యేకమైన గౌరవంగా ఆమె పేర్కొన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశం ఎంతో విలువైందిగా భావిస్తానని, అలాగే, తనకు మద్దతుగా నిలిచి నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రికెటర్లకు స్మృతి కృతజ్ఞతలు తెలిపారు. భారత మహిళా క్రికెట్? జట్టును మరింత ముందుకు తీసుకెళ్లెందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో గత కొన్నేళ్లుగా సారథ్యం వహించిన హర్మన్ ప్రీత్ సేవలను స్మృతి అభినందించారు. గొప్ప నిబద్ధతతో జట్టును ముందుకు నడిపించడంలో హర్మన్? కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

ఈ నెలలో జింబాబ్వేతో స్వదేశంలో జరిగే టీ20, వన్డే సిరీస్‌లకు స్మృతి మంధానను సారథిగా వ్యవహరించనున్నారు. టీ20ల్లో షెఫాలి వర్మ, వన్డేల్లో దీప్తి శర్మ వైస్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. అయితే, రెండు జట్లలోనూ హర్మన్‌ప్రీత్‌కు చోటు దక్కింది. రాయ్‌పుర్ వేదికగా ఈ నెల 16, 18, 20 తేదీల్లో టీ20 సిరీస్ జరుగనుంది. 23, 25, 28 తేదీల్లో వడోదర వన్డే సిరీస్‌కు ఆతిథ్యమివ్వనుంది. టీ20 జట్టులో ప్రతీకా రావల్‌కు చోటు దక్కలేదు. కానీ నికీ ప్రసాద్, మిన్ను మణి, అనుష్క శర్మ జింతిమని కలితాలను జట్టులోకి తీసుకున్నారు. వీరంతా ఆస్ట్రేలియా మహిళల జట్టుతో ఇటీవల జరిగిన సిరీస్‌లలో ఆడారు. ఇక, స్మృతి మంధాన విషయానికొస్తే, 29 ఏళ్ల మంధాన దేశవాళీ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో నాయకురాలిగా గణనీయమైన విజయాన్ని సాధించారు. ముఖ్యంగా 2024, 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్?సీబీ) జట్టును 'ఉమెన్స్ ప్రీమియర్ లీగ్' (డబ్ల్యూపీఎల్?) టైటిల్స్ వైపు నడిపించడం ఇందులో చెప్పుకోదగ్గ విషయం. ఈ విజయాలే ఆమెకు భారత



జట్టు పూర్తిస్థాయి నాయకత్వ బాధ్యతలు దక్కేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయని చెప్పవచ్చు. మరోవైపు, స్మృతి మంధాన నియామకంపై మిథున్ మన్హాస్ అభినందనలు తెలిపారు. స్మృతిపై పూర్తి నమ్మకం ఉందని, ఆటపై ఆమెకు ఉన్న అనుభవం ఈ కొత్త బాధ్యతలో జట్టుకు ఎంతో మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్మృతి సమర్థవంతంగా కెప్టెన్సీ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. స్మృతి సాధించిన విజయాని ఆయన ప్రస్తావించారు. '

# భారత క్రికెట్‌కు 'రో-కో' ఒక వరం

**పాకిస్థాన్ మాజీ పేసర్ సోహైల్ తన్వీర్**

టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం భారత క్రికెట్‌కు దొరికిన ఒక వరం అని పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ సోహైల్ తన్వీర్ ప్రశంసించాడు. వారిద్దరి అపార అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని, రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని వారి సేవలు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డాడు. ఇటీవల ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సోహైల్ తన్వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "విరాట్ కోహ్లీ గణాంకాలే అతని సత్తా ఏంటో చెబుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులకు అతను ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించాడు. కోహ్లీ వీలైనంత ఎక్కువ కాలం ఆడటం భారత క్రికెట్‌కు నిజంగా ఒక వరం" అని ఆయన అన్నాడు. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు కూడా వర్తింపజేస్తూ, వయసును ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. 2024 జూన్ లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కోహ్లీ, రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు, 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు



రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరూ కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తన్వీర్ మాట్లాడుతూ.. "సీనియర్ ఆటగాళ్లకు తమ ఆటను ఎలా నిర్వహించుకోవాలో బాగా తెలుసు. అదే సమయంలో వారు యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయగలరు. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్, లయను కాపాడుకోగలిగితే, అతను, కోహ్లీ ఇద్దరూ జట్టులో కొనసాగడం శుభపరిణామం" అని వివరించాడు. 39 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవలి కాలంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 92, 101 పరుగులు సాధించాడు. అతను 2027 ప్రపంచకప్‌లో ఆడతాడా? లేదా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఫామ్, ఫిట్‌నెస్ ఉన్నంతవరకు వయసుతో సంబంధం లేదని తన్వీర్ నొక్కిచెప్పాడు. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరు ఆటగాళ్ల మార్గదర్శకత్వంలో యువ జట్టు రాటుదేలుతుందని అభిప్రాయపడ్డాడు.

# చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది

## అగార్కర్‌కు గంభీర్ ఎమోషనల్ మెసేజ్

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఘనంగా వీడ్కోలు పలికాడు. అగార్కర్ హయాంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు గెలవడాన్ని గుర్తు చేసుకున్న గంభీర్.. భవిష్యత్తులో చరిత్ర అతడిని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుందని పేర్కొన్నాడు. "అజిత్ భాయ్.. మీతో కలిసి పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ హయాంలో సాధించిన మూడు ఐసీసీ ట్రోఫీలే మీ నమ్మకానికి నిదర్శనం. ఎప్పుడూ జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారు. చరిత్ర మిమ్మల్ని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుంది. ధన్యవాదాలు. మీ భవిష్యత్తుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని గంభీర్ 'ఎక్స్'లో పోస్టు చేశాడు. 2023 జులైలో అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్ సాధించింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు జట్లను ఎంపిక చేయడం అగార్కర్



చేపట్టిన చివరి బాధ్యతగా నిలిచింది. అగార్కర్ పదవీకాలం మంగళవారంతో అధికారికంగా ముగిసింది. ఖాళీ అయిన సెలెక్టర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రస్తుతం మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20లు, భారత్-ఏ జట్టుకు సంబంధించిన మూడు మ్యాచ్‌ల కోసం జట్ల ఎంపికలో అతడు పాల్గొన్నాడు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఓజాతో పాటు శివసుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ ఉన్నారు.

## (సంపాదకీయం)

# నోబెల్ పై ట్రంప్ ఆశలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మొర్కొవ్స్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నాళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటికే మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వెల్లడయ్యింది.నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహమ్ అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నాకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రుసరుసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా " నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారికే అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలలకే బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహిళల రుతుక్రమ పరిశుభ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కృషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కృషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు , భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతియుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యింది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యంలో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీకే పెద్ద అవమానమని ఆయన అన్నారు.2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయనకే తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాడో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతున్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండకపోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది.

# క్యాన్సర్ మందుల ధరలపై కేంద్రం కసరత్తు

**70 శాతం వరకు ధరల తగ్గింపుకు చర్యలు**

**30 శాతానికి పరిమితం కానున్న ట్రేడ్ మార్జిన్**



న్యూఢిల్లీ, అక్టోబర్ 08 క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ పరిధిలో లేని అన్ని క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేసింది. ఈ నిర్ణయంతో కొన్ని మందుల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల వరకు ఆదా అవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ నిర్ణయం బ్రాండెడ్, జనరిక్ మందులతో పాటు దేశీయ, దిగుమతి మందులకూ వర్తిస్తుంది. పేటెంట్ ఉన్నవి, లేనివి కూడా ఇందులోకి వస్తాయి. మందుల సరఫరా వ్యవస్థలో అధిక లాభాలను నియంత్రించడంతో పాటు క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది. క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 29న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం కీలక ప్రశ్నలు వేసింది. ఓ క్యాన్సర్ మందును రిటైలర్లకు సుమారు రూ.2,700కు సరఫరా చేస్తుండగా.. దాని ఎంఆర్‌పీ రూ.27,000గా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. మందులపై ఒకే విధమైన మార్జిన్‌ను నిర్ణయించలేమా అని కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పథకాల కింద చికిత్స పొందుతున్న వారికి ఆసుపత్రుల్లోని సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలని చెప్పడంపైనా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అక్టోబర్ 12న మరోసారి విచారణ జరగనుంది. ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం ఇదే తొలిసారి కాదు. 2019లో 42 నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) 30 శాతం మార్జిన్‌ను అమలు చేసింది. దీంతో 526 బ్రాండ్ల ఎంఆర్‌పీలు సగటున 50 శాతం తగ్గాయని కేంద్రం తెలిపింది. అప్పట్లో రోగులకు ఏటా సుమారు రూ.984 కోట్ల మేర ఆదా అయినట్లు అంచనా. తాజా నిర్ణయంతో కొన్ని మందుల ధరలు 70 శాతం వరకు తగ్గొచ్చని కేంద్రం చెబుతోంది. 2026 మార్చి నాటికి 131 క్యాన్సర్ మందులకు ఎన్‌పీపీఏ ధర పరిమితులు అమల్లో ఉన్నాయి. జన ఔషధి వంటి పథకాలు, కస్టమ్స్ సుంకాల తగ్గింపుతోనూ క్యాన్సర్ చికిత్స ఖర్చును తగ్గించే చర్యలు కొనసాగుతున్నాయి.

# దుబ్బాకలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఇటుక ట్రాక్టర్ ఢీకొన్న కారు**

**ఒకరు మృతి, నలుగురికి సీరియస్!**

దుబ్బాక, అక్టోబర్ 08(ఆర్ఎన్ఏ): దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిద్దిపేట--రామాయంపేట హైవేపై కారు, ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట--భూంపల్లి మండలంలోని అక్బర్‌పేట నుంచి ఇటుకల లోడుతో ఓ ట్రాక్టర్ హబ్షీపూర్ వైపు వెళు‌ండగా.. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళు‌న్న కారు ఎదురుగా వచ్చింది. హబ్షీపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి 765 డీజీపై రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన పడిపోయింది. ప్రమాద తీవ్రతకు కారు తీవ్రంగా దెబ్బతిన్నది. ఢీకొన్న వెంటనే కారు డ్రైవర్ తీవ్ర గాయాలతో వాహనంలోనే చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామ శివారులో గురువారం (అక్టోబర్ 08) సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిద్దిపేట--రామాయంపేట హైవేపై కారు, ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట--భూంపల్లి మండలంలోని అక్బర్‌పేట నుంచి ఇటుకల లోడుతో ఓ ట్రాక్టర్ హబ్షీపూర్ వైపు వెళ్తుండగా.. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చింది. హబ్షీపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి 765 డీజీపై రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన పడిపోయింది. ప్రమాద తీవ్రతకు కారు తీవ్రంగా దెబ్బతిన్నది. ఢీకొన్న వెంటనే కారు డ్రైవర్ తీవ్ర గాయాలతో వాహనంలోనే చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో గాయపడిన నలుగురిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అతివేగమా.. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యమా.. లేక మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలతో పాటు క్షతగాత్రుల వివరాలు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం పోలీసులు వెల్లడించాల్సి ఉంది. ఈ ఘటనతో హబ్షీపూర్ పరిసరాల్లో విషాదం నెలకొంది.

# రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

**విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు**

**అనవసర గందరగోళం సృష్టించరాదు**

**మాజీ న్యాయమూర్తుల ఘాటు వ్యాఖ్యలు!**

న్యూఢిల్లీ, అక్టోబర్ 08: దేశంలోని రాజ్యాంగ సంస్థలపై, ముఖ్యంగా ఎన్నికల సంఘం, ఉన్నత న్యాయవ్యవస్థపై జరుగుతున్న విమర్శలపై 42 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశ పౌరులను ఉద్దేశించి వారు ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజకీయ వేదికలపై ఎన్నికల సంఘం అధికారులు, న్యాయస్థానాలపై అవమానకరమైన భాషను ఉపయోగించడం ఆందోళనకరమని లేఖలో పేర్కొన్నారు. కొందరు రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల దొంగతనం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అదే ఆరోపణలకు సంబంధించి కోర్టుల్లో అఫిడవిట్లు, ఆధారాలు సమర్పించే విషయంలో వెనక్కి తగ్గుతున్నాయని వారు విమర్శించారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే ఈవీఎంలపై ఆధారపడే పార్టీలు ఓటమి ఎదురైనప్పుడు మాత్రం వాటి విశ్వసనీయతను ప్రశ్నించడం సరికాదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణపై జరుగుతున్న వివాదాన్ని కూడా మాజీ న్యాయమూర్తులు, అధికారులు ప్రస్తావించారు. 1950 చట్టం ప్రకారం ఓటర్ల జాబితాల సవరణకు చట్టపరమైన ఆధారం ఉందని తెలిపారు. మరణించిన వారు, ఒక ప్రాంతం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారు లేదా అర్హత లేని పేర్లను తొలగించడం, కొత్తగా అర్హత పొందిన పౌరుల పేర్లను చేర్చడం వంటి చర్యలు ఎన్నికల జాబితాలను మరింత ఖచ్చితంగా ఉంచేందుకు ఉద్దేశించినవేనని వివరించారు. నిష్పక్షపాత, విశ్వసనీయ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాలను నిరంతరం సరిచేయడం అవసరమని వారు పేర్కొన్నారు. అయితే ఈ పరిపాలనా ప్రక్రియను కుట్రగా చిత్రీకరించడం ద్వారా ప్రజల్లో అనవసరమైన అనుమానాలు, గందరగోళం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోతే దాని ప్రభావం ప్రజాస్వామ్యంపై తీవ్రంగా ఉంటుందని లేఖలో హెచ్చరించారు. ప్రజల్లో పెరిగే అవిశ్వాసం సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చని, దానిని దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు ఏ ఒక్క ప్రభుత్వం, రాజకీయ పార్టీకి చెందినవి కావని.. అవి దేశ ప్రజలందరికీ చెందినవని గుర్తుచేశారు. వాటి విశ్వసనీయతను దెబ్బతీయడం అంటే పౌరుల ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావం చూపడమేనని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో తీవ్రంగా పోటీ చేయవచ్చని, అయితే రాజ్యాంగ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా



వ్యవహరించకూడదని సూచించారు. ఏదైనా ఫిర్యాదు ఉంటే ఆధారాలతో ఎన్నికల సంఘం లేదా న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు. మీడియా సంస్థలు కూడా దర్యాప్తు, ఆధారాలు లేకుండా వచ్చే ఆరోపణలు, పుకార్లను వార్తలుగా ప్రచారం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ సంస్థలు పూర్తి పారదర్శకతతో, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో పౌరులు కూడా రాజకీయ వాదనలను గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని, విశ్వసనీయ ఆధారాల ఆధారంగానే నిర్ణయాలకు రావాలని పిలుపునిచ్చారు.

ప్రజల ఓటు శక్తిపై, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని 42 మంది మాజీ న్యాయమూర్తులు, అధికారులు తమ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.




# పెరిగిన బంగారం, వెండి ధరలు..

హైదరాబాద్, జూన్ 3: గత కొద్దిరోజుల నుంచి తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు నేడు స్వల్పంగా పెరిగాయి. 10 గ్రాముల 24, 22, 18 క్యారెట్ల బంగారంపై 10 రూపాయల చొప్పున పెరిగింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,56,220 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,200 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,170 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు ..**

వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. 100 గ్రాములపై 10 రూపాయలు.. కేజీ వెండిపై 100 రూపాయలు పెరిగింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి 29,000 రూపాయల వద్ద.. కేజీ వెండి 2,90,000 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు..




మే 3: పశ్చిమాసియాలో ఇరాన్–అమెరికా మధ్య ముదిరిన యుద్ధ ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను భారీగా దెబ్బతీశాయి. ఈ (బుధవారం) ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుంచే మార్కెట్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం గం. 10.50 సమయానికి సెన్సెక్స్ 851 పాయింట్లు పతనమై, 73,803 వద్ద ట్రేడవుతోంది. ఇదే సమయానికి నిఫ్టీ 243 పాయింట్లు కోల్పోయి, 23,240 వద్ద కదలాడుతోంది. మార్కెట్లోని దాదాపు అన్ని రంగాలు రెడ్ మార్క్‌లోనే ట్రేడ్ అవుతుండటం ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచింది.

కువైట్‌లోని యూఎస్ మిలిటరీ బేస్‌లపై ఇరాన్ నేరుగా క్షిపణి దాడులు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. ఇన్నాళ్లూ ఇరు దేశాల మధ్య చర్చలు సఫలమవుతాయని భావించిన మార్కెట్లకు ఈ తాజా దాడులు గట్టి షాకిచ్చాయి. యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉందన్న భయాలు గ్లోబల్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 0.88శాతం పెరిగి 96.84 డాలర్లకు చేరింది.

**ఐటీ (ఐ) షేర్లలో భారీ అమ్మకాలు:**

ఈరోజు మార్కెట్ పతనానికి ఐటీ రంగానికి చెందిన దిగ్గజ షేర్లు ప్రధాన కారణమయ్యాయి. ముఖ్యంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఐజూ) ఏకంగా 6.65శాతం కుప్పకూలగా, పర్సిస్టెంట్ సిస్టమ్స్ (గావతీంఅర్వత్ ూఎర్వఎం) 5.16శాతం నష్టపోయింది. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి పెద్ద షేర్లలో అమ్మకాల ఒత్తిడి నిఫ్టీని కిందకు లాగింది.

ఈ భారీ పతనంలోనూ కాంకర్డ్ బయోటెక్ 7.83శాతం, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 5శాతం, ఎన్‌హెచ్‌పీసీ 4.47శాతం లాభాలతో ట్రేడ్ అవుతూ మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచాయి. ఇక, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.70గా ఉంది.

# రోజూ కాఫీ తాగేవారు వీటిని కలిపితే..

## ఎన్నో పోషకాలను పొందవచ్చు..



ఉదయం నిద్రలేచిన వెంటనే చాలామందికి గుర్తొచ్చేది ఒక వేడి కప్పు కాఫీ. కొందరికి అది రోజును ఉత్సాహంగా ప్రారంభించే అలవాటు అయితే, మరికొందరికి పనిబారిన మధ్యలో కాసేపు రిలాక్స్ అయ్యే మార్గం అని చెప్పవచ్చు. రుచి, సువాసనతోపాటు కాఫీలో సహజంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి కొన్ని ప్రయోజనాలను అందిస్తాయని ఇప్పటికే అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే కొన్ని పోషక విలువలు కలిగిన పదార్థాలను కాఫీలో కలపడం ద్వారా దాని ఆరోగ్య ప్రయోజనాలను మరింత పెంచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**కోకో పౌడర్, నెయ్యి..**

కాఫీలో కొద్దిపాటి కోకో పౌడర్ లేదా ముడి కొకొవా కలపడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కోకోలో సమృద్ధిగా ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులోని పాలీఫినాల్స్, ఫ్లేవనాయిడ్లు గుండె ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంతోపాటు మెదడు పనితీరును మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో కాఫీ రుచికి కొత్తదనం రావడమే కాకుండా అదనపు పోషకాలు కూడా అందుతాయి. ఇటీవలి కాలంలో కాఫీలో ఏ2 నెయ్యి కలిపి తాగడం కూడా ప్రాచుర్యం పొందుతోంది. ఒక టీస్పూన్ ఏ2 నెయ్యిని కాఫీలో కలపడం ద్వారా జీర్ణవ్యవస్థకు మేలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇందులో ఉండే బ్యూటిరిక్ యాసిడ్ పేగుల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది జీర్ణనాళంలో వాపులను తగ్గించడంలో, పేగుల అంతర్గత పొరను ఆరోగ్యంగా ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.దాల్చిన చెక్క..దాల్చిన చెక్క కూడా కాఫీకి రుచి, సువాసనను జోడించడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను అందించే పదార్థంగా గుర్తింపు పొందింది. కాఫీలో చిటికెడు దాల్చిన చెక్క పొడిని కలపడం వల్ల శరీరంలో ఇన్సులిన్ స్పందన మెరుగుపడే అవకాశం ఉంటుంది. దీంతో గ్లూకోజ్‌ను శరీరం మరింత సమర్థంగా వినియోగించు కోగలుగుతుంది. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకో వాల్సిన అవసరం ఉన్నవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఈ పదార్థాలను కాఫీలో చేర్చడం వల్ల కొన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉన్నప్పటికీ, అవి ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి.

సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, తగిన నిద్రతోపాటు కాఫీని పరిమిత మోతాదులో తీసుకోవడం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చిన్న మార్పులతోనే ప్రతిరోజూ తాగే కాఫీని మరింత పోషకవంతంగా మార్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# పొగాకు వల్ల శరీరానికే కాకుండా అనేక విధాలుగా నష్టం.. ఎలాగంటే..?

పొగాకు వినియోగం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ ఒక ప్రధాన ప్రజారోగ్య సవాలుగా కొనసాగుతోంది. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, నమిలే పొగాకు వంటి వివిధ రూపాల్లో దీనిని వినియోగిస్తున్నప్పటికీ, దాని వల్ల కలిగే నష్టాలు కేవలం వినియోగదారులకే పరిమితం కావడం లేదు. కుటుంబాలు, సమాజం, ఆరోగ్య వ్యవస్థలు కూడా దీని ప్రభావాన్ని భరించాల్సి వస్తోంది. చాలా మంది పొగాకు కొనుగోలుకు అయ్యే రోజువారీ ఖర్చుపైనే దృష్టి పెడతారు. అయితే, దీని అసలు మూల్యం ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, కుటుంబ సంక్షేమం, పర్యావరణం వంటి అనేక రంగాల్లో చెల్లించాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్యపరమైన నష్టాలు తీవ్రంగా ఉంటాయి. ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉంది. అంతేకాకుండా గుండె జబ్బులు, పక్షవాతం, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధుల ప్రమాదాన్ని కూడా గణనీయంగా పెంచుతుంది. ఈ వ్యాధులు వ్యక్తి జీవితకాలాన్ని తగ్గించడమే కాకుండా జీవన నాణ్యతను కూడా దెబ్బతీస్తాయి.

**అనేక వ్యాధులు వస్తాయి..**

పొగాకులో ఉండే నికోటిన్ అనే పదార్థం వ్యసనానికి దారితీస్తుంది. ఆరోగ్యానికి హానికరమని తెలిసినా, నికోటిన్‌పై ఆధారపడటం వల్ల చాలా మంది ధూమపానాన్ని మానలేకపోతారు. కాలక్రమేణా ఇది రక్తనాళాలను దెబ్బతీసి, ఊపిరితిత్తుల పనితీరును తగ్గించి, శరీర రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. పొగాకు వల్ల కలిగే ప్రమాదం ధూమపానం చేసే వారితో మాత్రమే ముగిసిపోదు. పరోక్ష ధూమపానం కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, ముఖ్యంగా చిన్నారులు పొగలోని హానికర రసాయనాలను పీల్చుకోవాల్సి వస్తుంది. దీని కారణంగా గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. పిల్లల్లో శ్వాసనాళ ఇన్‌ఫెక్షన్లు, ఆస్తమా వంటి సమస్యలు అధికంగా కనిపించే అవకాశం ఉంటుంది. గర్భధారణ సమయంలో పొగాకు వినియోగం తల్లి, శిశువు ఇద్దరికీ ప్రమాదకరంగా మారుతుంది. ధూమపానం చేసే గర్భిణుల్లో ముందస్తు ప్రసవం, తక్కువ బరువుతో శిశు



వు జననం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. తక్కువ బరువుతో జన్మించిన శిశువులు బాల్యంలోనే కాకుండా భవిష్యత్తులో కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయి.

అంతేకాకుండా, ఇంట్లో ధూమపానం సాధారణంగా ఉండే వాతావరణంలో పెరిగే పిల్లలు భవిష్యత్తులో అదే అలవాటును అలవరచుకునే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

రోజువారీ జీవితంలో చేసే కొన్ని చిన్న అలవాట్లు పెద్దగా హానికరంగా అనిపించకపోవచ్చు. అయితే వాటిని నిరంతరం కొనసాగించడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉంటుంది. మూత్రాన్ని ఎక్కువసేపు ఆపుకోవడం నుంచి మొబైల్ చూస్తూ టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వరకు, సాధారణంగా కనిపించే కొన్ని అలవాట్లు దీర్ఘకాలంలో వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మూత్రాన్ని ఎక్కువసేపు ఆపుకోవడం చాలా మందికి సాధారణ అలవాటే. అయితే ఇలా చేయడం వల్ల మూత్రాశయంలో బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. దీని ఫలితంగా మూత్రనాళ సంక్రమణలు (యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు) వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అప్పుడప్పుడు ఇలా చేయడం పెద్ద సమస్య కాకపోయినా, తరచూ అలవాటుగా మారితే ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. నిద్రపోతున్నప్పుడు నోరు తెరిచి శ్వాస తీసుకోవడం కూడా మరో సమస్యాత్మక అలవాటు. దీనివల్ల నోరు పొడిబారడం, నిద్ర నాణ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా గురక పెరగడం ద్వారా రక్తపోటు వంటి సమస్యలతో కూడా




సంబంధం ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**టాయిలెట్‌లో ఎక్కువ సేపు గడపడం..**

వంగి కూర్చోవడం లేదా సరైన భంగిమ లేకుండా ఎక్కువసేపు పని చేయడం వెన్నెముక, మెడపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. దీని వల్ల కండరాల బిగుతు, నొప్పులు, కీళ్ల సమస్యలు వంటి ఇబ్బందులు క్రమంగా పెరిగే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసే వారు తమ కూర్చునే విధానంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ ఎక్కువసేపు టాయిలెట్‌లో గడపడం వల్ల ఆ ప్రాంతంలోని రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి మూలవ్యాధి (హెమరాయిడ్స్) సమస్య వచ్చే అవకాశం ఉంటుంది.

**తరచూ ముఖాన్ని చేతుల్తో తాకడం..**

తరచూ ముఖాన్ని చేతులతో తాకడం కూడా అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. రోజంతా వివిధ వస్తువులను తాకడం వల్ల చేతులపై పేరుకుపోయే బ్యాక్టీరియా, క్రిములు ముఖానికి చేరి చర్మ సమస్యలు, మొటిమలు లేదా ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. చాలా వేగంగా ఆహారం తినడం వల్ల మెదడుకు కడుపు నిండిన సంకేతం అందేందుకు తగిన సమయం దొరకదు. ఫలితంగా అవసరానికి మించి తినే అవకాశం ఉంటుంది. ఇది కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తుంది.

**ఇలా చేస్తే ఇన్ఫెక్షన్లు వస్తాయి..**

వేళ్ల చుట్టూ ఉండే చర్మాన్ని పదేపదే గిల్లడం లేదా కొరకడం కూడా చాలామందిలో కనిపించే అలవాటు. దీని వల్ల చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి వాటి ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. అలాగే తరచూ చాలా వేడి నీటితో స్నానం చేయడం కూడా చర్మ ఆరోగ్యానికి అనుకూలం కాదు. వేడి నీరు చర్మంలోని సహజ నూనెలను తొలగించి చర్మం పొడిబారడానికి, చికాకు కలగడానికి కారణమవుతుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పెద్ద మార్పుల కంటే చిన్న అలవాట్ల సవరణలు కూడా ఎంతో ప్రభావవంతంగా ఉంటాయి. రోజువారీ జీవితంలో ఈ అలవాట్లను గుర్తించి అవసరమైన మార్పులు చేసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.



# పవన్ కల్యాణ్ నా చిన్ననాటి క్రష్: ఆనంది

తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు. తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

# వారణాసిలో మరో సర్‌ప్రైజ్..







సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న వారణాసిపై రోజురోజుకూ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవలం తెలుగు ప్రేక్షకుల కోసమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో విపరీతమైన ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. రాజమౌళి గత చిత్రాలైన బాహుబలి, ఆర్ఆర్ఆర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. అయితే వారణాసి విషయంలో మాత్రం ఆయన మరింత భారీగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, ప్రపంచ నిర్మాణం ఇలా ప్రతి అంశంలోనూ కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నారని టాక్. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. వారణాసిలోని కొన్ని కీలక సన్నివేశాల కోసం ప్రత్యేకమైన భాషను, లిపిని రూపొందించినట్లు సమాచారం.కథలోని ఒక ప్రత్యేక ప్రపంచాన్ని మరింత సహజంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించేలా చూపించేందుకు ఈ కొత్త భాషను ఉపయోగించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి గతంలో బాహుబలి కోసం కిలికి అనే ప్రత్యేక భాషను సృష్టించిన విషయం తెలిసిందే. సినిమాలోని కల్పిత ప్రపంచానికి తగ్గట్టుగా ఆ భాషను రూపొందించడం అప్పట్లో ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు వారణాసి కోసం కూడా అలాంటి ప్రయోగమే చేస్తున్నారనే వార్త సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. అయితే ఈ కొత్త భాష సినిమాలో ఏ సందర్భంలో వినిపించనుంది.? అనే విషయాలు మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉన్నాయి. మొత్తానికి రాజమౌళి వారణాసిని సాధారణ అడ్వెంచర్ సినిమాగా కాకుండా, భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లేలా రూపొందిస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, వరుసగా బయటకు వస్తున్న ఇలాంటి ఆసక్తికరమైన విషయాలు ప్రేక్షకుల్లో అంచనాలను భారీగా పెంచుతున్నాయి.

# భారతీయుడు 3 పోస్టర్ విడుదల




విశ్వనటుడు కమల్ హాసన్, అగ్ర దర్శకుడు శంకర్ కాంబోలో వచ్చిన సినిమా 'ఇండియన్'. తెలుగులో 'భారతీయుడు' పేరుతో విడుదలైంది. 1996లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం సాధించింది. దీనికి కొనసాగింపుగా 2024లో 'భారతీయుడు 2' (ఇండియన్ 2) సినిమా వచ్చింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం.. డిజాస్టర్ గా మారింది. దీంతో పార్ట్-3 ఉంటుందా లేదా? అనే దానిపై గత రెండేళ్లుగా సందిగ్ధత నెలకొంది. దీనికి తెర దించుతూ మేకర్స్ ఉన్నట్టుండి 'ఇండియన్ 3' సినిమాపై కీలక అప్డేట్ అందించారు. 'ఇండియన్ 3: వార్ మోడ్' అనే పేరుతో లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ గురువారం ఆసక్తికరమైన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఇందులో ముగ్గురు గుర్రపు వ్యక్తులు స్వారీతో దుమ్మురేపుతూ దూసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. "ఇండియన్-3 వార్ మోడ్‌లో పునరాగమనం మొదలవుతుంది.. ఏమాత్రం సహనం లేకుండా తిరిగి వస్తున్న సేనాపతి ఈసారి ఎవ్వరినీ ఉపేక్షించడు" అని పేర్కొన్నారు. ఈ సినిమా హిందీలో 'హిందుస్థాని 3', తెలుగులో 'భారతీయుడు 3' పేర్లతో వస్తుందని క్లారిటీ ఇచ్చారు. 'భారతీయుడు 2' సినిమాలో కమల్ హాసన్ తో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య, ప్రియా భవానీ శంకర్, బాబీ సింహా తదితరులు కీలక పాత్రల్లో నటించారు. వీరితో పాటుగా కాజల్ అగర్వాల్ కూడా 'భారతీయుడు 3' చిత్రంలో భాగమయ్యారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. రవి వర్మన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'ఇండియన్ 3: వార్ మోడ్' టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు కానీ, సినిమాని ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారనేది మేకర్స్ వెల్లడించలేదు.

# అతనికి నేను ఒకే చెప్పేశా..

టాలీవుడ్‌లో కథానాయికగా అడుగుపెట్టి దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న నటి అనుష్క శెట్టి. గ్లామర్ పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ముఖ్యంగా అరుంధతి, బాహుబలి, రుద్రమదేవి, భాగమతి వంటి సినిమాలు అనుష్కకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే సినిమాల్లో ఎంత పాపులారిటీ ఉన్నప్పటికీ.. వ్యక్తిగత విషయాల విష యంలో మాత్రం అనుష్క చాలా ప్రైవేట్‌గా ఉంటారు. తన వ్యక్తిగత జీవితం గురించి పెద్దగా మాట్లాడేందుకు ఇష్టపడని ఈ స్వీటీ.. అప్పుడప్పుడు ఇంటర్వ్యూల్లో తన జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయా లను పంచుకుంటూంటారు. అలాంటి ఓ సందర్భంలో ఆమె చెప్పిన చిన్ననాటి ప్రేమ జ్ఞాపకం ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్న అనుష్క.. తాను ఆరో తరగతిలో ఉన్నప్పుడు జరిగిన ఓ సరదా సంఘటనను పంచుకున్నట్లు సమాచారం. ఓ అబ్బాయి తన దగ్గరకు వచ్చి నేరుగా 'ఐ లవ్ యు' అని చెప్పాడట. అయితే అప్పటికి ప్రేమ అంటే ఏమిటో, 'ఐ లవ్ యు' అనే మాటకు అసలు అర్థం ఏమిటో కూడా తనకు తెలియదని అనుష్క చెప్పుకొచ్చారు. ఆ మాట విన్న వెంటనే ఏం చేయాలో తెలియక అమాయకంగా 'సరే' అని చెప్పేశానని నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులో జరిగిన ఆ సంఘటనను ఇప్పుడు తలుచుకుంటే చాలా అమాయ కంగా, అందంగా అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. తన బాల్యంలో మిగిలిపోయిన మధురమైన జ్ఞాపకాల్లో అదొకటని చెప్పడంతో.. అనుష్క అభిమానులు కూడా ఈ విషయాన్ని ఆసక్తిగా షేర్ చేస్తున్నారు.అనుష్క వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో రకరకాల వార్తలు, ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా ఆమె వివాహం ఎప్పుడు జరుగుతుంది.? ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నారు.? అనే ప్రశ్నలు అభిమానుల్లో చాలాకాలంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఓ పాన్ ఇండియా హీరోతో అనుష్కకు ప్రేమ సంబంధం ఉందంటూ గతంలో పలు సందర్భాల్లో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి.



# ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు వెళ్లిపోవాల్సిందే

**మరణానికి ముందు నానా పటేకర్? వ్యాఖ్యలు**



ప్రముఖ సినీ నటుడు నానా పటేకర్ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలో ఆయనకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం ఒకటి ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. తన అకాల మరణానికి కేవలం మూడు రోజుల ముందే గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో పటేకర్? మాట్లాడారు. ఆ సమయంలో తనదైన శైలిలో మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు వెళ్లిపోవాల్సిందే, రేపు నేను ఉంటానో లేదో నాకు తెలియదు. ఆ సమయం ప్రతి ఒక్కరి జీవితంలోనూ వస్తుంది. కానీ అది రాకముందే, 'నేను చేయాలనుకున్న పనిని చేయగలుగుతున్నానా? దాని కోసం ప్రయత్నం చేశానా?' అని మనం ఆలోచించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 4న గోవాలోని పనాజీ సమీపంలో ఉన్న డోనా పౌలాలో 'సమ్రాట్ క్లబ్ ఇంటర్నేషనల్' నిర్వహించిన కార్యక్రమంలో పటేకర్ ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన తన స్నేహితుడు, గోవా మాజీ ముఖ్యమంత్రి దివంగత మనోహర్ పారికర్‌ను కూడా స్మరించుకున్నారు.